ప్రజాశక్తి

మంగళవారం 20 డిసెంబర్ 2022 5

పార్వతీపురం మన్యం



బాధితులకు సత్వర న్యాయం : ఎస్‌పి

ప్రజాశక్తి - పార్వతీపురంరూరల్

బాధితులకు సత్వర న్యాయం అందించేందుకు స్పందన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎస్‌పి వి.విద్యాసాగర్ నాయుడు తెలిపారు. సోమవారం నిర్వహించిన స్పందనకు ప్రజల నుండి 10 ఫిర్యాదులను స్వీకరించిన ఎస్‌పి, వారి సమస్యలను అడిగి తెలుసుకొని, సంబంధిత పోలీసు అధికారులతో ఫోనులో మాట్లాడి, వాటిని పరిష్కరించేందుకు చట్ట పరిధిలో చర్యలు చేపట్టాలని సూచించారు. ఫిర్యాదుదారులకు న్యాయం చేయాలని సంబంధిత పోలీసు అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో దిశ మహిళా పిఎస్ డిఎస్‌పి ఎస్‌ఆర్ హర్షిత, ఎస్పి సిబి ఎన్. శ్రీనివాసరావు, డిసిఆర్‌బి ఎస్ఐ దినకర్ మరియు సిబ్బంది పాల్గొన్నారు.

ఖాళీ స్థలాల్లో ప్రవేశాలా?

జగనన్న కాలనీల్లో గృహ ప్రవేశాలు ఇప్పట్లో జరిగే అవకాశాలు కనిపించడం లేదు. ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి పుట్టిన రోజు సందర్భంగా రాష్ట్ర వ్యాప్తంగా గృహ ప్రవేశాలు పండగలా చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయించింది. అయితే విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల్లో చాలా వరకు నిర్మాణాలు నేటికీ పూర్తి కాలేదు. మరికొన్ని చోట్ల అసలు లే అవుట్లకు రహదారులు గాని, విద్యుత్తు సదుపాయం గాని లేకపోవడంతో లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణాలకు ముందుకు రావడం లేదు.

- జగనన్న లేఅవుట్లలో కానరాని సౌకర్యాలు
- రోడ్లు లేవు.. విద్యుత్తు లైన్లు లేవు
- నిర్మాణాలకు ముందుకురాని లబ్ధిదారులు

ప్రజాశక్తి-విలేకర్ల బృందం

ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేసిన జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణం నత్తనడకన సాగుతోంది. విజయనగరం జిల్లాలో 78,158 ఇళ్లు, పార్వతీపురం మన్యం జిల్లాలో 25, 968 ఇళ్లు మంజూరయ్యాయి. నేటివరకు పార్వతీపురం మన్యం జిల్లాలో 5018, విజయనగరం జిల్లాలో 7,457 మంది లబ్ధిదారులు ఇంతవరకు పునాదులు కూడా తీయలేదు. కొన్ని ఇళ్లు పునాదులు, మరికొన్ని లింటల్ లెవెల్‌లో నిలిచిపోయాయి. ఉన్నాయి. ప్రభుత్వం ఇచ్చిన డబ్బులు ఇళ్ల నిర్మాణాలకు సరిపోకపోవడం, కాలనీల్లో సౌకర్యాలు లేకపోవడం, పలుచోట్ల గ్రామాలకు, పట్టణాలకు దూరంగా ఉండడం వల్ల లబ్ధిదారులు ఆసక్తి చూపలేదు. ఈనేపథ్యంలో అధికారులు ప్రారంభించని ఇళ్ల స్థలాలను రద్దు చేస్తామని హెచ్చరించినప్పటికీ లబ్ధిదారులకు ఏమీ చేయాలో పాలుపోవడం లేదు.



వీరఘట్టం : అచ్చెపువలసలో నిర్మాణాలు చేపట్టక ఖాళీగా ఉన్న జగనన్న లేఅవుట్

ఎమ్మెల్యే స్వగ్రామంలో ప్రారంభం కాని ఇళ్ల నిర్మాణాలు

వీరఘట్టం : మండలంలోని 38 పంచాయతీల్లో 19 లేఔట్లుగా ఏర్పాటు చేసి 1004 మందికి జగనన్న ఇళ్ల స్థలాలు పంపిణీ చేశారు. ఇందులో ఇప్పటి వరకూ ఆదారు, నర్సిపురం 2, వండువలో ఒక ఇల్లు నిర్మాణం ప్రారంభమయ్యాయి. సొక్కాత్తు నియోజకవర్గ ఎమ్మెల్యే స్వగ్రామమైన వండవలో 64 ఇళ్లు మంజూరు కాగా, ఇప్పటికీ నిర్మాణాలు ప్రారంభం కాలేదు. పిఎంజెఆర్ కింద మంజూరైన ఇళ్లలో ఒకే ఒక ఇంటికి భూమి పూజ అయ్యింది. అలాగే మండలంలో పిఎంఎవై పథకం కింద 368 ఇళ్లు మంజూరు కాగా, ఇప్పటి వరకూ 210 మంది లబ్ధిదారులకు కేవలం రూ.5వేలు చొప్పున ఖాతాలో జమ అయ్యాయి.

లబ్ధిదారులు 1897మంది.... నిర్మాణమైనవి 14

జిల్లా కేంద్రమైన పార్వతీపురం మున్సిపాల్టీలో 24 జగనన్న లేఅవుట్లు వేయగా, ఇళ్ల నిర్మాణాలకు లబ్ధిదారులెవరూ ముందుకు రాకపోవడంతో అందులో 8 లేఅవుట్లను రద్దు చేశారు. మిగిలిన 17 జగనన్న లేఅవుట్లు అక్కడక్కడా పనులు జరుగుతున్నాయి. ఈ 17 లేఅవుట్లలో 1897మంది లబ్ధిదారులకు స్థలాలను కేటాయించారు. వీరిలో ఇప్పటి వరకూ కేవలం 14మందే ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేశారు. 778మంది మాత్రమే పనులు ప్రారంభించారు. అవి కూడా పునాదులతో నిలిచిపోయారు. మరో 694మంది పునాదుల నిర్మాణాలను పూర్తి చేశారు. 55మంది లబ్ధిదారులు శ్లాబ్‌లెవెల్ వరకూ గోడల నిర్మించి వదిలేశారు. మరో 45మంది లబ్ధిదారులు శ్లాబులు వేశారు. అయితే ప్రభుత్వం నిర్దేశించి ఈనెల 21న గృహప్రవేశాలకు కేవలం 14 ఇళ్లు మాత్రమే సిద్ధంగా ఉన్నాయి. ఇళ్ల నిర్మాణాలకు జాప్యానికి ప్రధాన కారణం పెరుగుతున్న ఇళ్ల సామాగ్రి ధరలతో పాటు లేఅవుట్లలో కనీస సౌకర్యాలు లేకపోవడంతో మరో కారణం. అంతేకాక ప్రభుత్వం అందించే అరకొరసాయం ఎందుకూ సరిపడడంలేదని లబ్ధిదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

బొబ్బిలి: పట్టణంలో ఐటిఐ కాలనీ వద్ద జగనన్న లేఅవుట్‌లో 394 మందికి, రామన్నదొరవలస వద్ద రెండు లేఅవుట్లలో 2574 మందికి ఇళ్లు మంజూరు చేశారు. ఐటిఐ కాలనీ వద్ద 356 మందికి పైగా నిర్మాణాలు ప్రారంభించారు. 41 మంది ఇళ్ల నిర్మాణాలు పూర్తిచేశారు. రామన్నదొరవలస వద్ద రెండు లేఅవుట్లలో 1838 మంది పునాదులు నిర్మించారు. కానీ మూడు

2574 ఇళ్లకు మూడే పూర్తి

ఇళ్ల నిర్మాణాలు మాత్రమే పూర్తిచేయడం గమనార్హం. రోడ్లు, నీటి సౌకర్యం లేకపోవడం, ప్రభుత్వమిచ్చే డబ్బులు సరిపడక పోవడం వల్ల నిర్మాణ పనులకు లబ్ధిదారులు ముందుకు రావడం లేదు.



బొబ్బిలి.. పునాదులు నిర్మించి వదిలేసిన లబ్ధిదారులు




కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న గిరిజనులు

జిఒ 52ను రద్దు చేయాలి

- పట్టణంలో భారీ ర్యాలీ, ధర్నా
- గిరిజనులకు అన్యాయం చేస్తే ప్రభుత్వానికి బుద్ధి చెబుతాం

ప్రజాశక్తి - కలెక్టరేట్

బోయ, వాల్మీకులను గిరిజన జాబితాలో చేర్చొద్దని, జీవో 52ను రద్దు చేయాలని, గిరిజన సమస్యలను పరిష్కరించి వెనకబడిన గిరిజనులకు న్యాయం చేయాలని ఆదివాసీ ఐక్య సంఘాల కార్యసాధన సంఘాల ఆధ్వర్యంలో స్థానిక మున్సిపల్ కార్యాలయం నుంచి కలెక్టరేట్ వరకూ ర్యాలీ నిర్వహించారు. బోయ, వాల్మీకులను చేర్చొద్దని, జీవో 52ను రద్దు చేయాలని, గిరిజనులకు అన్యాయం చేయొద్దంటూ నినాదాలు ఇస్తూ ర్యాలీలో నినాదాలు చేశారు. గిరిజనుల నినాదాలతో పార్వతీపురం పట్టణం మారుమోగిపోగా, గిరిజన సాంప్రదాయ డప్పులతో కలెక్టరేట్ వరకూ ర్యాలీ చేపట్టారు. అనంతరం కలెక్టరేట్ వద్ద ధర్నా చేపట్టారు. ధర్నా కార్యక్రమం ఉద్దేశించి ఆదివాసీ ఐక్య కార్యసాధన సంఘాల చైర్మన్ నిమ్మక జయరాజు మాట్లాడుతూ బోయ, వాల్మీకులను గిరిజనులు జాబితాలోచేర్చడాన్ని గిరిజన అంతా వ్యతిరేకిస్తున్నారన్నారు. తక్షణమే 52 జీవోను వెనక్కి తీసుకోవాలని, కొత్తగా ఏర్పాటు చేసిన కమిటీని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. జెఎసి వైస్ ప్రెసిడెంట్ గుమ్మడి సంధ్యారాణి మాట్లాడుతూ గిరిజన ఐక్యతను చాటుతూ వారి హక్కుల పరిరక్షణకు నేడు గిరిజనులంతా ఏకత్రాటిపై నిలిచి ముందుకు వచ్చారని అన్నారు. ఎస్‌టి సబ్ ప్లాన్ నిధులు అందడం లేదని ప్రశ్నిస్తే నవరత్నాలలో కల్పిస్తున్నామని ప్రభుత్వం చెప్పడం విడ్డూరమన్నారు. అలాగే ఐటిడిఎ సేవలను పూర్తిస్థాయిలో నిర్వహించాలన్నారు. గిరిజనులకు సబ్సిడీ రుణాలు, పనిముట్లు అందడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. గిరిజన శాఖ మంత్రి గిరిజన సమస్యలను ప్రభుత్వ దష్టికి తీసుకెళ్లి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. మాజీ ఎమ్మెల్యే కె.లక్ష్మణమూర్తి మాట్లాడుతూ సుమారు 33 తెగలు గల గిరిజనులు సుమారు 30 లక్షలుంటే, బోయ, వాల్మీకులు మాత్రమే 40 లక్షలు ఉన్నారని, దీనివల్ల గిరిజనులు తన హక్కులను కోల్పోయే ప్రమాదం ఉందని అన్నారు. దీన్ని ప్రభుత్వం వెంటనే వెనక్కి తీసుకోవాలని కోరారు. అనంతరం గిరిజన సంఘ నాయకులు ఐటిడిఎ పిఒ విష్ణుచరణ్‌కు వినతిపత్రం అందజేశారు. పిఒ మాట్లాడుతూ గిరిజన సమస్యల పరిష్కారానికి తనవంతు ప్రయత్నం చేస్తామని హామీనిచ్చారు. కార్యక్రమంలో జిల్లాలోని అన్ని గిరిజన సంఘాల నాయకులు, గిరిజన ఉద్యోగులు, రైతులు, విద్యార్థులు, మహిళలు పాల్గొన్నారు.



ఏనుగల దాడిలో మృతి చెందిన ఆవులు

ఏనుగు దాడిలో మూడు ఆవులు మృతి

ప్రజాశక్తి - కొమరాడ

మండలంలో ఏనుగులు మరోసారి బీభత్సం సృష్టించాయి. మండలంలో కుమ్మరి గుంట పంచాయతీ రావికర్రవలసలో గజరాజు లు ఆవులపై దాడి చేశాయి. గ్రామానికి చెందిన యు.సత్యం అనే రైతుకు చెందిన మూడు ఆవులు మృతి చెందాయి. ఇప్పటికే ఏనుగులు గుంపులు పదుల సంఖ్యలో ఆవులు మృతి చెందాయి. ఏనుగులు బారిన నష్టపోయిన రైతులకు పూర్తిస్థాయిలో పరిహారం చెల్లించి ఆదుకోవాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.

అటవీశాఖ అధికారులు నిర్బంధించిన గ్రామస్తులు

ఏనుగుల దాడిలో ఆవులు మృతి చెందడంపై ఒక్కసారిగా గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. మండలంలో రావికర్రవలసకు వచ్చిన అటవీశాఖ అధికారులను సిబ్బందిని గ్రామస్తులు ఒక్కసారిగా ఆందోళన చెంది వారిని ఇంటిలో పెట్టి తాళాలు వేసి నిర్బంధించారు. గత ఆరేళ్లుగా ఏనుగులతో తీవ్ర ఇబ్బందులు పడుతుంటే అధికారులు కనీసం చర్యలు తీసుకోకపోవడం దారుణమంటూ నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా సిపిఎం నాయకులు కొల్లి సామమూర్తి మాట్లాడుతూ ఏనుగుల గుంపుతో రైతులు ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నా పాలకులు, అధికారులు పట్టించుకునే వారే కురువయ్యారని ఆందోళన చెందారు. ఇప్పటికే పదుల సంఖ్యలో ఆవులో ప్రాణాలు పోతున్నా ప్రభుత్వం స్పందించకపోవడం అన్యాయమ న్నారు. జిల్లాస్థాయి అధికారులు వచ్చి సమాధానం చెప్పేంత వరకూ అటవీశాఖ సిబ్బంది విడిచి పెట్టే ప్రసక్తి లేదని తేల్చి చెబుతూ నినాదాలు చేశారు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని ప్రజలతో చర్చించారు. ఏనుగుల వల్ల తాము నష్టపోతుంటే పాలకులు కనీసం పట్టించుకోవడం లేదని నిలదీశారు. ఏనుగుల తరలింపునకు చర్యలు చేపట్టాలని ఉన్నతాధికారి దృష్టిలో తీసుకెళ్తామని పోలీసులు చెప్పడంతో ఆందోళన విరమించి, నిర్బంధంలో ఉన్న అధికారులు, సిబ్బందిని విడిచిపెట్టారు. తక్షణమే అధికారులు స్పందించి ఏనుగులను అటవీ ప్రాంతానికి తరలించి ప్రజలను, రైతులను ఆదుకోవాలని కోరారు.


25 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు : జెసి

ప్రజాశక్తి - కలెక్టరేట్

జిల్లాలో 1.91 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ లక్ష్యంగా కాగా, ఇప్పటికే 25 వేల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేశామని జాయింట్ కలెక్టర్ ఒ.ఆనంద్ తెలిపారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియపై స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతుల నుంచి 40 కిలోల ధాన్యం బరువు, 180 గ్రాముల గోనె సంచి బరువు మాత్రమే నమోదు చేస్తామని స్పష్టం చేశారు. రైతుల నుంచి ముందుగానే ధాన్యం నమూనాలు తీసుకొని వాటిని పరీక్షించి రైతులకు తెలియజేస్తామ న్నారు. రైతులకు, మిల్లర్లకు మధ్య ఎటువంటి సంబంధం లేదని స్పష్టం చేశారు. గోనె సంచులను, రవాణా చార్జీలను ఏర్పాటు చేశామన్నారు. ప్రతిరోజు జిల్లాలో మూడు నుండి ఐదువేల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేయుటకు చర్యలు చేపట్టామని, సంక్రాంతికి ముందుగానే 80 శాతం లక్ష్యం పూర్తి చేయాలని ప్రయత్నిస్తున్నట్లు ఆయన వివరించారు. ఇప్పటికే జిల్లాలో దాదాపు 16 లక్షల గోనె సంచులు అందించామన్నారు. ఇంకా అవసరమైనా సంచులు అందించేందుకు సిద్ధంగా ఉన్నామని ఒక ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. గోనె సంచులు అవసరం ఉంటే మండల వ్యవసాయాధికారికి తెలియజేయాలని వెంటనే వాటిని అందించుటకు ఏర్పాటు చేస్తామని ఆయన స్పష్టం చేశారు. జిల్లాలో రైతులు రెండు లక్షల గోనె సంచులు ఇప్పటి వరకు ఏర్పాటు చేసుకున్నారని వాటికి దాదాపు రూ.6 లక్షలు చెల్లించామని చెప్పారు. రవాణా సమస్య ఎక్కడ తలెత్తకుండా జిల్లాలో రవాణా కాంట్రాక్టర్లను ఏర్పాటు చేశామని వీటితోపాటు సాలూరు, విజయనగరం, పార్వతీపురం, రాయగడ లారీ యాజమాన్యాలతో మాట్లాడినట్లు తెలిపారు. ప్రతి మండలంలో ఐదు నుండి 10 లారీలను ఏర్పాటు చేశామన్నారు. ధాన్యం కొనుగోలు పై జిల్లా కేంద్రంలో కంట్రోల్ రూమ్ లను (08963293037, 7702003585) ఏర్పాటు చేశామని రైతులు తమ సందేహాలకు లేదా వివరాలకు కంట్రోల్ రూమ్ కు ఫోన్ చేయవచ్చని తెలిపారు. మిల్లుల వద్ద అన్ లోడింగ్ కొరకు చార్జీలు వసూలు చేస్తున్నట్లు జాయింట్ కలెక్టర్ దష్టికి మీడియా ప్రతినిధులు తీసుకురాగా అటువంటి వాటిపై సమాచారం ఉంటే సంబంధిత సిబ్బందిని సస్పెన్షన్ చేస్తామని, అవసరమైతే తొలగించుటకు వెనుకాడబోయేది లేదని స్పష్టం చేశారు. జిల్లాలో 99 శాతం ఇ క్రాప్ జరిగిందని, 88 శాతం ఇకేవైసీ జరిగిందని చెప్పారు. ఇ క్రాప్ చేసిన రైతుల నుండి కోనుగోలు చేస్తున్నట్లు ఆయన వివరించారు. పౌర సరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ ఎం.దేవుళ్ల నాయక్ మాట్లాడుతూ జిల్లాలో రూ.25 కోట్ల విలువగల ధాన్యం కొనుగోలు చేశామని, ఇందులో ఇప్పటి వరకు రూ.10 కోట్లు చెల్లించామని చెప్పారు. మిగిలిన రూ.15 కోట్లు చెల్లింపు ప్రక్రియలో ఉందన్నారు. ధాన్యం కొనుగోలు చేసిన తర్వాత చెప్పిన సమయానికి ముందుగానే 10 రోజుల్లో చెల్లింపు జరుగుతోందని అన్నారు. రైతులు ఎక్కడ ఒక పైసా కూడా చెల్లించాల్సిన అవసరం లేదనిస్పష్టం చేశారు. విలేకర్ల సమావేశంలో డిఎస్ఒ కెవిఎల్ఎన్ మూర్తి పాల్గొన్నారు.

పోరాడైన ధాన్యం కొనిపిద్దాం : ఎపి రైతు సంఘం

ప్రధానమంత్రి మోడీ పెట్టిన షరతులకు భయపడి ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ధాన్యం కొనడం ఆపేశారని, ఇకనైనా సిఎం చొరవ తీసుకొని ధాన్యం కొనేలా చర్యలు తీసుకోవాలని ఎపి రైతు సంఘం జిల్లా అధ్యక్ష ఉపాధ్యక్షులు రెడ్డి లక్ష్మునాయుడు, బంటుదాసు, నాయకులు కె.రవీంద్ర డిమాండ్ చేశారు. ఈ మేరకు స్థానిక సుందరయ్య భవనంలో ప్రభుత్వం విన్నకంటై పోరాడైనా ధాన్యం కొనిపిద్దాం అన్న పోస్టర్‌ను సోమవారం విడుదల చేశారు



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న రైతు సంఘం నాయకులు



కళ్లాల్లోని ధాన్యం పరిశీలిస్తున్న రైతు సంఘం నాయకులు

షరతుల్లేకుండా ధాన్యం కొనాలి

ప్రజాశక్తి - జియ్యమ్మవలస

ఎలాంటి షరతుల్లేకుండా రైతుల నుంచి ఆర్‌బికె ద్వారా నేరుగా ధాన్యం కొనుగోలు చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కొల్లి గంగు నాయుడు, మండల కార్యదర్శి కోరంగి సీతారాం రైతులు ఆరబెట్టిన ధాన్యాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా గంగు నాయుడు మాట్లాడుతూ ఆర్‌బికెలు ద్వారా ధాన్యాన్ని కొనుగోలు చేస్తున్నామని ప్రచారం చేయడం తప్ప క్షేత్రస్థాయిలో సక్రమంగా జరగడం లేదని, నూటికి పది శాతం ధాన్యాన్ని కూడా రైతుల నుంచి కొనుగోలు చేయలేదని అన్నారు. ప్రభుత్వం పెట్టిన విధానంతో రైతులు అనేక ఇబ్బందులు గురవుతున్నారన్నారు. రైతులకు సరిపడా గోనె సంచులు ఇవ్వలేదని, బస్తాకు మూడు రూపాయల 90 పైసలు ఇస్తామని అధికారులు ప్రకటించారని, మార్కెట్లో ఒక బస్తా రూ.16కు కొనాల్సి వస్తుందన్నారు. అలాగే రవాణా చార్జీలు రైతు అకౌంట్లో వేస్తామని అధికారులు చెబుతున్నారని వెంటనే లారీలకు, ట్రాక్టర్లకు రైతులు రవాణా చార్జీలు ఇవ్వలేకపోతున్నారని, ఈ విధానం వల్ల ఒక్కొక్కసారి 100 నుండి 150 కిలోమీటర్ల వరకు రైస్ మిల్లుకు ధాన్యం తరలించాల్సి వస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. దీనివల్ల రూ.100 నుంచి రూ.150 వరకు ఒక బస్తా ధాన్యానికి రవాణాచార్జీలు అవుతాయని, ఇంత పెద్ద మొత్తం భారం రైతు భరించలేరని, కావున రవాణా చార్జీలు వెంటనే ఇవ్వాలని, జంబ్లింగ్ విధానం రద్దుచేసి స్థానికంగా ఉన్న రైస్ మిల్లులకే ధాన్యం పంపించాలని, రైతులందరికీ సరిపడా గోనె సంచులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేకపోతే రైతులందరినీ కదిలించి పెద్ద ఎత్తున ఆందోళన చేయాల్సి వస్తుందని హెచ్చరించారు. కార్యక్రమంలో శిఖ బడి రైతులు యర్రా సత్యన్నారాయణ, తదితరులు పాల్గొన్నారు.

స్పందన దరఖాస్తులపై సత్వర చర్యలు

ప్రజాశక్తి - కలెక్టరేట్

స్పందన కార్యక్రమాన్ని స్థానిక జిల్లా కలెక్టర్ కార్యాలయంలో సోమవారం నిర్వహించారు. స్పందన కార్యక్రమంలో వచ్చిన అర్జీలపై సకాలంలో చర్యలు తీసుకోవాలని కలెక్టరు నిశాంత్ కుమార్ జిల్లా అధికారులను అదేశించారు. జెసి ఒ.ఆనంద్, ఐటిడిఎ పిఒ సి.విష్ణు చరణ్, డిఆర్ఒ జె.వెంకటరావు ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. విభిన్న ప్రతిభావంతులకు కలెక్టరు కార్యాలయం సెల్లారులో గల సమావేశమందిరంలో ప్రత్యేక స్పందన కార్యక్రమం నిర్వహించగా, డిఆర్ఒ వారి నుండి అర్జీలను స్వీకరించారు. స్పందన కార్యక్రమం అనంతరం జిల్లా కలెక్టరు నిశాంత్ కుమార్ ప్రభుత్వ పథకాల లక్ష్యాలపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. శాఖల వారీ నివేదికలను సకాలంలో అందించాలని ఆదేశించారు. వాక్సినేషన్, బాలికా గర్భిణిలు, ఆయుష్మాన్ భారత్, జగనన్న స్వచ్ఛసంకల్పం పథకాల లక్ష్యాలను పూర్తి చేయాలని తెలిపారు. బడిఈడు పిల్లలంతా తప్పని సరిగా పాఠశాలలకు వచ్చేలా చర్యలు తీసుకోవాలన్నారు. నిర్బంధ వయోవిద్యను ఖచ్చితంగా అమలు చేయాలని తెలిపారు. ఎక్కడైనా బడిఈడు పిల్లలతో పనిచేయిస్తే వారిపై చైల్డ్ లేబరు చట్టం ప్రకారం కేసులు పెట్టాలన్నారు. అలాగే సచివాలయ సిబ్బంది పనితీరుపై జిల్లా అధికారులు పర్యవేక్షణ ఉండాలన్నారు. ప్రతి పంచాయతీలో సచివాలయం సిబ్బందిని నియమించినప్పటికీ వారు సరిగ్గా పనిచేయకపోవడంతో జిల్లా కార్యాలయాలపై పని భారం తగ్గడంలేదని, ప్రజలు ప్రతిపనికి జిల్లా కార్యాలయాలకు వస్తున్నారని, కావున సచివాలయ సిబ్బంది పనితీరును మదింపుచేసి శాఖల వారీగా నివేదికలను అందజేయాలని జిల్లా అధికారులను ఆదేశించారు. స్పందన కార్యక్రమంలో 106 అర్జీలు, విభిన్న ప్రతిభావంతులు ఏడు అర్జీలు అందజేశారు.



సమస్యలను వింటున్న కలెక్టర్ నిశాంత్‌కుమార్

కూలిరేట్లు పెంచాలని కళాసీలు ధర్నా

ప్రజాశక్తి - కలెక్టరేట్

కూలిరేట్లు పెంచాలని కోరుతూ రైస్‌మిల్లు కళాసీలు సోమవారం స్థానిక సుందరయ్య భవనం నుంచి కలెక్టరేట్ వరకూ ర్యాలీగా వెళ్లి, అక్కడ ధర్నా నిర్వహించారు. అనంతరం కలెక్టర్ నిశాంత్ కుమార్‌కు కళాసీలు వినతిపత్రం అందజేశారు. ధర్నానుద్దేశించి సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి వై.మన్మధరావు మాట్లాడుతూ పార్వతీపురం రైస్ మిల్లు కళాసీలకు మేలో చేయాల్సిన వేతనాలు ఒప్పందాన్ని ఏడు నెలలుగా వాయిదా వేసిన యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని కోరారు. పాత పద్ధతులు పీసీ రేట్లు ఒప్పందం వెంటనే చేయాలని లేని పక్షంలో నిరసన పోరాటం ఉధృతం చేస్తామని హెచ్చరించారు. సిఐటియు జిల్లా కోశాధికారి జి.వెంకటరమణ మాట్లాడుతూ పార్వతీపురం ప్రాంతంలో రైస్‌మిల్ కళాసీలకు, యజమానులకు మధ్య పీస్ రేట్లు ఒప్పందం జరుగుతుందని, పాత సర్వీసులు కార్మికులను కాదని యజమానులు ఇప్పుడు కొత్త డిమాండ్లు తెస్తున్నారని అన్నారు. ధాన్యం కొనుగోలు సీజన్లో రైతులను, కార్మికులను ఇబ్బందుకు గురి చేస్తున్నారన్నారు. తక్షణమే కళాసీలకు పీటు రేటు ఒప్పందం వెంటనే చేయాలి, పెరిగిన ధరల వల్ల కళాసీలకు 100శాతం కూలీ రేట్లు పెంచాలి, ఒప్పందం రెండేళ్లకు మాత్రమే చేయాలని, పాత పీస్ రేట్లు ఒప్పందం గ్రామాల్లోని వారికి కూడా అమలు చేయాలని, కొత్త ఒప్పందం మే 11నుంచి అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పెద్దసంఖ్యలో కళాసీలు పాల్గొన్నారు.



కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న కళాసీలు



కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న అంగన్‌వాడీలు

ఉద్యోగోన్నతులు కల్పించాలని అంగన్‌వాడీల ధర్నా

ప్రజాశక్తి- కలెక్టరేట్

అంగన్వాడీ హెల్పర్లకు ఉద్యోగోన్నతి కల్పించాలని కోరుతూ సోమవారం స్థానిక కలెక్టరేట్ వద్ద ధర్నా చేశారు. ఈ సందర్భంగా యూనియన్ జిల్లా అధ్యక్ష కార్యదర్శు పి.సరళ, గంట జ్యోతి మాట్లాడుతూ పార్వతీపురం ఐసిడిఎస్ ప్రాజెక్టు పరిధిలో గల చినబొండపల్లి, బాలగొడబ, గోపాలపురం నుంచి వర్కర్లుగా జీవో ప్రకారం ప్రమోషన్ చేస్తూ ఇచ్చిన ఆదేశాలను తిరిగి ఐటిడిఎ పిఒ తీసుకున్నారన్నారు. చిన్నబొండపల్లి-1 కేంద్రంలో రిటైర్మెంట్ అయినందున అదే సెంటర్‌లో ఇవ్వకుండా అన్యాయం చేశారని అన్నారు. అదే కేంద్రంలో పనిచేస్తున్న లతశ్రీ ఉద్యోగోన్నతి కల్పించకుండా మూడో సెంటర్ లో పనిచేస్తున్న హెల్పర్‌కు ఇవ్వడం అన్యాయ మని అన్నారు. బాలగొడబ, చిన్నబొండపల్లి, గోపాలపురం హెల్పర్లకు ఆర్డర్ ఇచ్చి తీసుకోవటం అన్యాయమని అన్నారు. ఏ సెంటర్‌లో వర్కర్ ఖాళీ అయిన వెంటనే ఉద్యోగోన్నతి కల్పించాలని కోరారు. కార్యక్రమంలో సిఐటియు అధ్యక్ష, ఉపాధ్యక్షులు జి.వెంకటరమణ, వి.ఇందిర, యూనియన్‌న ఆయకులు ధర్మవతి, గౌరీ, రాజేశ్వరి, జ్యోతి, విజయలక్ష్మి, పలువురు అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

నేడు ఓటరు జాబితా పరిశీలకులు రాక

ప్రజాశక్తి - కలెక్టరేట్

ఎన్నికల రోల్ అబ్జర్వర్ ఎ.బాబు జిల్లాలో మంగళవారం పర్యటించనున్నారని జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ తెలిపారు. ఈ మేరకు సోమవారం ఒక ప్రకటన జారీ చేశారు. రోల్ అబ్జర్వర్ మంగళవారం మధ్యాహ్నం 12 గంటల నుంచి జిల్లా కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించే ఓటర్ నమోదు అధికారులు, సహాయ ఓటర్ నమోదు అధికారులు, వివిధ పార్టీల ప్రతినిధులు తదితరులతో సమావేశం నిర్వహిస్తారని, అభ్యంతరాలు, సూచనలు స్వీకరిస్తారని ఆయన పేర్కొన్నారు. సమావేశంలో సంబంధిత ప్రతినిధులు పాల్గొనాలని ఆయన కోరారు.

హెల్త్ అలవెన్సు బకాయిలు విడుదల చేయాలి



కమిషనర్‌కు వినతినిస్తున్న కార్మికులు

సాలూరు : మున్సిపల్ కార్మికులకు సంబంధించిన హెల్త్ అలవెన్సు బకాయిలు విడుదల చేయాలని కోరుతూ సోమవారం మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ ఆధ్వర్యాన కార్మికులు కమిషనర్ హెచ్ శంకరరావుకి వినతిపత్రం అందజేశారు. ఈ ఏడాది సెప్టెంబర్, నవంబర్ నెలలకు సంబంధించిన హెల్త్ అలవెన్సు బకాయిలు ఇంతవరకు చెల్లించలేదని ఫెడరేషన్ అధ్యక్షుడు పి.రాముడు, కార్యదర్శి టి.శంకరరావు చెప్పారు. మరణించిన కార్మికుల కుటుంబాలకు ఉద్యోగాలివ్వాలని డిమాండ్ చేశారు. ఆ కార్మికుల కుటుంబాలు ఉపాధి లేక పస్తులతో అలమటిస్తున్నాయని చెప్పారు. వెంటనే ఉద్యోగాలు ఇవ్వాలని కోరారు.

గ్రీన్ అంబాసిడర్ల సమస్యలపై నేడు ధర్నా

పాచిపెంట : గ్రీన్ అంబాసిడర్లకు కనీసవేతనం రూ.10వేలు చెల్లించాలని, ఇతర సమస్యలపై ఈనెల 20న కలెక్టరేట్ వద్ద తలపెట్టి ధర్నాను విజయవంతం చేయాలని సిఐటియు నాయకులు కోరాడ ఈశ్వరరావు, చింత పోలిరాజు పిలుపునిచ్చారు. జీవో 57 ప్రకారం వేతనాలు చెల్లించాలని, గ్రీన్ అంబాసిడర్ల ఆరోగ్య పరిరక్షణకు గ్లౌజులు, మాస్కులు, యూనిఫామ్ అందించాలని, బకాయి వేతనాలు చెల్లించాలని తదితర సమస్యలపై ధర్నా చేపట్టనున్నట్టు తెలిపారు. కావున ఈ ధర్నాకు గ్రీన్ అంబాసిడర్లంతా పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు కోట వెంకటేష్, ఎం.రాంబాబు, వై.రామస్వామి, కొర్ర శంకర్రావు తదితరులు పాల్గొన్నారు

టీచర్ల బదిలీల దరఖాస్తు గడువు పొడిగించాలి

పార్వతీపురం టౌన్ : ఉపాధ్యాయ బదిలీలకు సంబంధించి దరఖాస్తు చేసుకునేందుకు ఈనెల 20 వరకు గడువును పొడిగించాలని ఎపి ఎస్‌సి, ఎస్‌టి ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సామల సింహాచలం కోరారు. ఉపాధ్యాయ బదిలీలకు దరఖాస్తు గడువు ఆదివారం వరకు ఇచ్చారని, అయితే బదిలీ పాయింట్లు, రేషనలైజేషన్ తదితర అనేక అంశాల్లో ఆన్‌లైన్‌లో దరఖాస్తులను నింపేటప్పుడు పూర్తిస్థాయిలో పాయింట్లు రావడం లేదన్నారు. అలాగే ఇటీవల మంత్రితో జరిగిన సమావేశంలో ఇచ్చిన హామీల ప్రకారంగా పాయింట్లు కేటాయించడం జరగలేదన్నారు. కావున బదిలీలో న్యాయం జరిగేందుకు పాయింట్లు కేటాయించాలని, దరఖాస్తు చేసుకునేందుకు మరో రెండు రోజులు గడువు పొడిగించాలని సామల విజ్ఞప్తి చేశారు.

కాలు పోగొట్టుకున్న వ్యక్తికి ఎమ్మెల్యే సాయం

కురుపాం : గరుగుబిల్లి మండలం నాగూరు గ్రామానికి చెందిన వాసిరెడ్డి చంద్రమౌళి ప్రమాదంలో దెబ్బ తగిలి కాలు పూర్తిగా తీసివేశారు. స్థానిక ఎమ్మెల్యే పాముల పుష్ప శ్రీవాణికి తన సమస్యను తెలపగా, ఆమె ప్రత్యేక చొరవ తీసుకొని రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఎల్‌ఒసి నిధులు రూ.2.50లక్షలు మంజూరు చేయించి తనకి సాధారణ కాలుతో సమానంగా పూర్తి ప్లెక్సిబుల్ కాలు ఏర్పాటు చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు.

రహదారుల పరిస్థితి దారుణం

సీతంపేట : మండలంలో రహదా రులు దారుణంగా ఉన్నాయని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం. తిరుపతిరావు అన్నారు. స్థానిక సిపిఎం కార్యాలయం మండల కమిటీ సమావేశం ఎం. వెంకటేష్ అధ్యక్షన సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా తిరుపతి రావు మాట్లాడుతూ మండలంలో గ్రామాలకు వెళ్లే రహదారులు దారుణంగా ఉన్నాయని, వినతి పత్రాలు ఇచ్చిన పట్టించుకోవడం లేదని అన్నారు. ఐటిడిఎ అధికారులు నిధులు లేవంటున్నారని ప్రజా ప్రతినిధిలు మాత్రం అభివృద్ధికి నిధులు కొరత లేదంటున్నారని ఏది నమ్మాలో ప్రజలకు అంతు పట్టడం లేదన్నారు. ఈ నెలాకారు లోగ పనులు ప్రారంభం కాకపోతే ఐటిడిఎ వద్ద ఆందోళన చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శి ఎ. భాస్కర్‌రావు, పి. సాంబయ్య, జె. శ్రీరాములు పాల్గొన్నారు.

పశువుల శాలగా ఆర్అండ్‌బి కార్యాలయం

వీరఘట్టం : మండల కేంద్రంలోని రోడ్లు, భవనాల శాఖ కార్యాలయం పశువుల సాలగా మారింది. 12 ఏళ్ల కిందట ఈ భవనం ఎంతో సుందరంగా ఉండేది అధికారులు అలసత్వం వల్ల వీటిని పూర్తిగా పట్టించుకోకపోవడంతో చుట్టుపక్కల ఉన్న పాడి రైతులు పశువులశాలగా వినియోగించుకుంటున్నారు.

వాహన చోదకులకు అనుమతులు తప్పనిసరి

కురుపాం : స్థానిక రావాడ జంక్షన్ వద్ద సోమవారం ఎల్విన్‌పేట సిఐ సత్యనారాయణ వాహనాలు తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన వాహన చోదుకులతో మాట్లాడుతూ వాహనం నడిపిన ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా డ్రైవింగ్ లైసెన్స్ వాహనానికి సంబంధించిన అన్ని అనుమతి పత్రాలు ఉండాలన్నారు. ద్విచక్ర వాహనం నడిపిన వారు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలన్నారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనం పరిశీలన

సీతానగరం : మండలంలోని బుడ్డిపేట ప్రాథమిక పాఠశాలలో మధ్యాహ్నం భోజనం పథకాన్ని ఎంపిడిఒ బి.కృష్ణమహేశ్‌రెడ్డి సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న పోషకాహారం అందించాలని, భోజనంలో నాణ్యత పాటించాలని అన్నారు. పిల్లలను భోజనం గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఉపాధ్యాయుల హాజరు పట్టికలను పరిశీలించారు. కార్యక్రమంలో ఇఒపిఆర్‌డి కెకె వర్మ, ఉపాధ్యాయులు వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

వికలాంగులకు ల్యాప్‌టాప్‌లు పంపిణీ

కలెక్టరేట్ : జిల్లాలో వికలాంగులకు స్థానిక కలెక్టరేట్ సమావేశం మందిరంలో ప్రత్యేక స్పందన కార్యక్రమం నిర్వహించారు. ఈ స్పందనలో ఏడు అర్జీలు అందజేశారు. డిఆర్ఒ జె.వెంకటరావు అర్జీలు స్వీకరించారు. కార్యక్రమంలో సహాయ ఉపకరణాల ఉచిత పంపిణీ కార్యక్రమంలో భాగంగా సాలూరుకు చెందిన ప్రభుత్వ ఐటిఐ చదువుతున్న మామిడి త్రినాధరావు, హైదరాబాదులో బికాం చదువుతున్న పాలకొండ మండలం కొండాపురానికి చెందిన నల్ల బారికి చంద్రశేఖర్ ల్యాప్ టాప్‌లు పంపిణీ చేశారు.

కూలి పెంచాలని కళాసీలు వినతి

మక్కువ : మండలంలోని పనిచేస్తున్న కళాసీలకు ఒప్పందం ప్రకారం కూలి పెంచాలని స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద సోమవారం ఐఎఫ్‌టియు ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ మండల కేంద్రంలో రెండేళ్లకొకసారి కూలి పెంచాలని వ్యాపారులతో ఒప్పందం కుదుర్చుకున్నప్పటికీ ఇంతవరకూ ఎలాంటి హామీ ఇవ్వలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఒప్పందం గడువు ముగిసి వారం రోజులు కావస్తున్నా ఎంతవరకు వ్యాపారులు ఆలస్యం చేస్తున్నారని, తక్షణమే తహశీల్దార్ జోక్యం చేసుకుని కళాసీలకు కూలి పెంచాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు గోపాల అప్పారావు, గౌరునాయుడు పాల్గొన్నారు.

పోలీస్ స్టేషన్ నూతన భవనం పరిశీలన



పోలీసు స్టేషన్‌ను పరిశీలిస్తున్న డిఎస్‌పి

జియ్యమ్మవలస : మండలం లోని చినమేరంగి పోలీస్ స్టేషన్ నూతన భవన సముదాయాన్ని సోమవారం డిఎస్‌పి జివి కృష్ణారావు పరిశీలించారు. పనుల పురోగతి ఎంతవరకు వచ్చింది అనేది కాంట్రాక్టర్‌తో చర్చించారు. నిర్మాణ పనులు వేగవంతం చేయాలని డిఎస్‌పి కాంట్రాక్టరుకు సూచించారు. డిఎస్‌పి వెంట సిఐ సిహెచ్ ప్రసాద్ ఉన్నారు.

కరాటే బెల్ట్ గ్రేడింగ్‌లో విద్యార్థుల ప్రతిభ

కురుపాం : ఏపి ఒకినోవా ఆధ్వర్యంలో ఇటీవల నెల్లిమర్లలో నిర్వహించిన బెల్టు గ్రేడింగ్ ఛాంపియన్స్ కరాటే పోటీల్లో స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నుంచి పలువురు విద్యార్థులు ప్రతిభ కనబర్చి విజేతలుగా నిలిచారు. వీరిని సోమవారం పాఠశాల ఉపాధ్యాయులు అభినందించి అనంతరం విద్యార్థులకు రానున్న రోజుల్లో జిల్లా, రాష్ట్ర స్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబరిచి తల్లిదండ్రులకు పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పిటిఐఆర్ నాయుడు, కరాటే మాస్టర్ కె.నరేష్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం : డిప్యూటీ సిఎం

ప్రజాశక్తి - పాచిపెంట

అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పాలన సాగిస్తుందని డిప్యూటీ సిఎం పి.రాజన్నదొర అన్నారు. మండలంలోని మంచాడవలసలో సోమవారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి హాజరైన రాజన్న దొర ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాల గురించి వివరిస్తూ సంక్షేమ పథకాలు సక్రమంగా అందుతున్నాయా లేదా అంటూ లబ్ధిదారులను అడిగారు. అలాగే అర్హత ఉండీ సాంకేతిక లోపాల వల్ల పథకాలు వర్తించకపోతే లబ్ధిదారులకు పథకాలు వర్తించేలా చూడాలని అధికారులను ఆదేశించారు. గ్రామంలో ఏమైనా సమస్యలుంటే తెలియజేయాలన్నారు. పలువురు యువకులు కాలువలపై పలకలు నిర్మించాలని కోరారు. పలకల ఏర్పాటుకు చర్యలు చేపట్టాలని ఎంపిడిఒ పి.లక్ష్మీకాంత్‌ను ఆదేశించారు. కార్యక్రమంలో సర్పంచ్ చీమల సావిత్రి, పి.వీరంనాయుడు, డోల బాబ్జీ, టి.గౌరీశ్వరరావు, పలువురు సర్పంచులు, ఎంపిటిసి సభ్యులు, పాల్గొన్నారు.

కురుపాం : మండలంలోని గుమ్మ పంచాయతీలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే పి.పుష్పశ్రీవాణి నిర్వహించారు. గ్రామంలోని ఇంటింటికి వెళ్లి ప్రజలు సమస్యలు అడిగి తెలుసుకున్నారు.



బ్రోచర్‌ను మహిళలకు అందిస్తున్న డిప్యూటీ సిఎం రాజన్నదొర

ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు నవరత్నాలు గూర్చి అడిగి తెలుసుకున్నారు. సమస్యలు ఏమైనా ఉంటే సచివాలయ సిబ్బంది దృష్టికి తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపిపి శెట్టి పద్మావతి, జిల్లా కో ఆప్షన్ సభ్యులు షేక్ నిసార్, వైసిపి జిల్లా అధికార ప్రతినిధి శెట్టి నాగేశ్వరరావు, కళింగ వైశ్య జిల్లా అధ్యక్షులు అంధవరపు కోటేశ్వరరావు, కురుపాం మేజర్ పంచాయతీ సర్పంచ్ జి.సుజాత, ఉపసర్పంచ్ షేక్ ఆదిల్, వైసిపి నాయకులు, కార్యకర్తలు, సచివాలయ సిబ్బంది వాలెంటర్లు పాల్గొన్నారు.

వీరఘట్టం : మండల కేంద్రంలోని బిసి కాలనీలో సోమవారం నిర్వహించిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే వి.కళావతి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రతి గృహానికి వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు అందుతున్నాయా? అని అడిగి తెలుసుకున్నారు. కాలనీవాసులు కులాయిల ద్వారా తాగునీరు సరఫరా చేయాలని, మంచినీటి బోరుబావి ఏర్పాటు చేయాలని, కాలువ కూడా నిర్మించాలని కోరారు. వర్షాలు పడితే మురికి నీరు గృహాల్లోకి చేరిపోతుందని దళిత మహిళలు ఆరోపించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కళావతి మాట్లాడుతూ గడపగడపకు మన ప్రభుత్వంలో వచ్చిన ఫిర్యాదుకు సంబంధించి అభివృద్ధి పనులు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ముఖ్యంగా గ్రామాల్లో తాగునీటి ఇబ్బంది లేకుండా చూడాలని ఆదేశించారు. కార్యక్రమంలో వైసిపి పరిశీలకులు డోల జగన్, సర్పంచ్ పి.గౌరమ్మ, ఎంపిపి డి. వెంకటరమణనాయుడు, జెడ్‌పిటిసి జంపు కన్నతల్లి, ఉమామహేశ్వరరావు, ఎంపిడిఒ ఎ.ప్రభాకరరావు, ఎపిఎం శివుని నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

కేటాయించిన నిధులు ఖర్చు చేయాలి

ప్రజాశక్తి - సీతానగరం

భవన నిర్మాణ కార్మికుల సంక్షేమానికి కేటాయించిన నిధులు వారికే ఖర్చు చేయాలనే భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కె.గౌరీశంకర్రావు డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయ ఆవరణలో భవన నిర్మాణ కార్మికుల మండల మహాసభ జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మిక సమస్యలపై పోరాట ఫలితంగా 1993లో సంక్షేమ బోర్డును ఏర్పాటు చేశారన్నారు. సంక్షేమ బోర్డును ఏర్పాటు చేసినప్పటికీ భవన నిర్మాణం కార్మికుల కోసం నిధులు కేటాయించినప్పటికీ ఆ నిధులను ఇతర రంగాలకు ఖర్చు చేయడం దుర్మార్గమన్నారు. వైసిపి ప్రభుత్వం అధికారానికి వచ్చిన తర్వాత వెల్ఫేర్ బోర్డు లో ఉన్న రూ.150 కోట్లు భవన నిర్మాణ కార్మికుల కోసం కాకుండా ఇతర రంగాలకు చేసిందన్నారు. భవన నిర్మాణ కార్మికుల కోసం ప్రమాద బీమా రూ.10 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. వెల్ఫేర్ బోర్డు ద్వారా ఆ నిధులు భవన నిర్మాణ కార్మికులకే ఖర్చు చేయాలన్నారు. 60 ఏళ్ల భవన నిర్మాణ కార్మికుల కోసం పెన్షన్లు మంజూరు చేయాలన్నారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు



సంఘీభావం వ్యక్తం చేస్తున్న నాయకులు

ఇ.ఇంద్ర, జి.జ్యోతి, భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు ఆర్.రాము, ఆర్.శంకర్రావు. తాలాపు రమేష్, సిఐటియు మండల కార్యదర్శి జి.వెంకటరమణ, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు ఆర్.ఈశ్వరరావు, లక్ష్మునాయుడు, వివిధ గ్రామాల భవన నిర్మాణ కార్మిక సంఘాల కార్మికులు పాల్గొన్నారు. అనంతరం మండల నూతన కమిటీ ఎన్నికైంది. అధ్యక్షులుగా ఎస్.కృష్ణ, కార్యదర్శిగా టి.రమేష్‌తో పాటు 12 మంది సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

ధాన్యం కొనుగోలుకు కృషి

ప్రజాశక్తి - సీతానగరం



అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జోగారావు

రైతులకు ఇబ్బంది లేకుండా ధాన్యం కొనుగోలు చేసి మిల్లులకు తరలించేందుకు అధికారులు, ప్రజా ప్రతినిధులు కృషి చేయాలని ఎమ్మెల్యే ఎ.జోగారావు సూచించారు. మండలంలోని నిడగల్లు రైతు భరోసా కేంద్రంలో రైతుల నుంచి ధాన్యం నేరుగా కళ్లాల వద్దనే సేకరించి మిల్లులకు తరలించేందుకు సిద్ధంగా ఉన్న ధాన్యం బస్తాలను ఆయన పరిశీలించి అక్కడ ఉన్న పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతి రైతు నుంచి సకాలంలో ధాన్యం కొనుగోలు చేసి సత్వరమే మిల్లులకు పంపించేలా వ్యవసాయ అధికారులు, ఆర్‌బికె సహాయకులు, వాలంటీర్లు సహాయంతో చర్యలు తీసుకోవాలన్నారు. అవసరమైన సహాయ సహకారాలు స్థానిక ప్రజా ప్రతినిధులు అందించాలని సూచించారు. ధాన్యం అమ్మకంలో రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, వారికి అవసరమైన గన్నీ బ్యాగులు, ధాన్యం తరలించేందుకు లారీలను సంబంధిత ఉన్నతాధికారులతో మాట్లాడి వెంట వెంటనే ఏర్పాటు చేస్తామన్నారు. కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా వ్యవసాయ సలహా మండలి ఛైర్మన్ వాకాడ నాగేశ్వరరావు, ఎఒ ఎస్.అవినాష్, స్థానిక సర్పంచ్, ప్రజా ప్రతినిధులు, నాయకులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

ఇతర కులాలను చేరిస్తే సహించం

ప్రజాశక్తి- సీతంపేట



మాట్లాడుతున్న భూదేవి

ఆదివాసీలు ఆర్థికంగా, సామాజికంగా వెనుకబడటంతో పాటు ఒక ప్రత్యేక సాంస్కృతి, సాంప్రదాయాలు ఉన్నందున షెడ్యూల్ తెగలుగా రాజ్యాంగంలో స్థానం కల్పించారని, అలాంటి ఎస్‌టిల జాబితాలోకి బోయిలు, మత్స్యకారులు, బెంతు ఒరియాలను కలిపేందుకు కుట్ర జరుగుతుందని గిరిజన నేత, టిడిపి నాయకులు పడాల భూదేవి ఆరోపించారు. సోమవారం సీతంపేటలో ఏర్పాటు చేసిన పత్రిక సమావేశంలో ఆమె మాట్లాడుతూ వెనుకబడిన గిరిజనుల అభివృద్ధి కోసం ఎటువంటి చర్యలు తీసుకోని వైసిపి ప్రభుత్వం ఇతర కులాలను ఎస్‌టి జాబితాలోకి తీసుకురావాలని కుట్ర చేస్తుందని దుయ్యబట్టారు. ఇప్పటికే జిఒ నెంబర్ 3 రద్దు చేయటం వల్ల యువతకు తీరని అన్యాయం జరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు. జిఒ నెంబర్ 52 శామ్యూల్ ఆనంద్ ఏకసభ్య కమిషన్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఇప్పటికీ గిరిజన తండాల్లో ప్రాథమిక హక్కులకు నోచుకోవటం లేదని అన్నారు. తన పర్యటనలో తాగునీటికి కూడా ఇబ్బందులు పడే గ్రామాలు చూశానని అన్నారు. ఉన్నత విద్య, వైద్యం, సక్రమంగా అందటంలేదన్నారు. యువతకు ఉపాధి లేక వలసలలో దుర్భల జీవితం గడుపుతుండటం భాదకరంగా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. గిరిజన యువనేతలు ఊయక భానుచందర్, సవర మోహన్ పాల్, బిడ్డక బంగారయ్య, పువ్వల కైలాష్, యస్ శరత్, భూగన్న తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా జగన్మోహన్‌రెడ్డి జన్మదిన సంబరాలు

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి 50వ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని పార్వతీపురంలో సోమవారం నుంచి మూడు రోజులపాటు క్రీడా, సాంస్కృతిక, సేవా కార్యక్రమాలు నిర్వహించేందుకు సన్నాహాలు చేశారు. ఇందులో భాగంగా ప్రభుత్వ జూనియర్ కళాశాల క్రీడా మైదానంలో నియోజకవర్గ స్థాయి కబడ్డీ, వాలీబాల్, బ్యాడ్మింటన్ పోటీలను స్థానిక ఎమ్మెల్యే అలజంగి జోగారావు ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రంగవల్లిల పోటీలను నిర్వహించనున్నట్లు తెలిపారు. ఇందులో గెలుపొందిన వారికి ప్రథమ బహుమతిగా రూ.10వేలు, రెండో బహుమతిగా రూ.5వేలు, మూడో బహుమతిగా రూ.3వేలు ప్రదానం చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్‌పర్సన్ బోను గౌరీశ్వరి, వైస్ ఛైర్ పర్సన్ కొండపల్లి రుక్మిణి, వైసిపి పట్టణ అధ్యక్షులు కొండపల్లి బాలకృష్ణ, పార్టీ ఫ్లోర్ లీడర్ మంత్రి రవికుమార్, ఎంపిపి మజ్జి శోభారాణి, వైస్ ఎంపిపి సిద్ధ జగన్నాధ రావు, మండల పార్టీ అధ్యక్షులు బి. రమేష్, వార్డుల కౌన్సిలర్, కోఆప్షన్ సభ్యులు, పలువురు ఎంపిటిసి సభ్యులు, సర్పంచులు, రాష్ట్ర డైరెక్టర్లు, కార్యకర్తలు, నియోజకవర్గ స్థాయి క్రీడాకారులు పాల్గొన్నారు.

పందులను తరలించాలి

పార్వతీపురం టౌన్ : పార్వతీపురంలో గత ఐదేళ్లుగా ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్న ఏనుగులను తరలించే చర్యలు చేపట్టాలని, ఏనుగులను కాకపోయినా కనీసం పందులనైన ప్రజల నుంచి దూరంగా తరలించాలని జనసేన నాయకులు కోరారు. ఈ మేరకు సోమవారం జాయింట్ కలెక్టర్ ఓ.ఆనంద్‌ను కలిసి ఏనుగులు, పందులు సమస్యపై ప్రజలు పడుతున్న ఇబ్బందులపై చర్చించారు. వినతిని అందజేసిన వారిలో జనసేన నాయకులు వి.దాలినాయుడు, రాజాన రాంబాబు, నెయ్యిగాపుల సురేష్, సిరిపురపు గౌరీశంకర్ మాట్లాడుతూ పార్వతీపురం పట్టణంలోని కొత్తవలస, బెలగాం, పట్టణం, జగన్నాధపురం తదితర ప్రాంతాల్లో పందులు స్వైర విహారం చేస్తూ ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తున్నాయన్నారు. వాటిని దూరంగా తరలించే చర్యలు చేపట్టాలని కోరారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ ఎలిఫెంట్ జోన్ ఏర్పాటు చేసేందుకు చర్యలు చేపడుతున్నామన్నారు. పందులు తరలింపుకు చర్యలు చేపడతామన్నారు.

సమస్యలు పరిష్కరించకపోతే సేవలకు సెలవు

ప్రజాశక్తి - వీరఘట్టం



నిరసన తెలుపుతున్న 108 ఉద్యోగులు

108 సిబ్బంది సమస్యలను పరిష్కరించకపోతే వచ్చే ఏడాది జనవరి 15 తర్వాత సేవలకు సెలవులు తప్పవని 108 సిబ్బంది హెచ్చరించారు. సోమవారం మండల కేంద్రంలోని నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా 108 సిబ్బంది మాట్లాడుతూ వేతనాలను ఎఐఎంఎస్ సంస్థ ద్వారా చెల్లిస్తున్నప్పటికీ, 24 గంటలు ప్రజలకు ఉచిత అత్యవసర వైద్య సేవలు 108 అంబులెన్స్ ద్వారా అందిస్తున్న ఈఎంటి, పైలెట్లకు ప్రతి నెల జీతాలు చెల్లింపులు తీవ్ర జాప్యం జరుగుతుందన్నారు. ఉద్యోగానికి కూడా గ్యారెంటీ లేకపోవడంతో ఆందోళన చెందుతున్నామన్నారు. నెలకు ఈఎంటికి రూ. 30వేలు, పైలట్లకు రూ.28వేలు వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. అరబిందో ఎమర్జెన్సీ మెడికల్ సర్వీస్ సంస్థ వచ్చిన తర్వాత అక్రమంగా వివిధ కారణాలతో విధులు నుండి తొలగించిన వారిని తిరిగి విధుల్లోకి చేర్చుకోవాలని కోరారు. సిఎం ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలని, అధికారులకు జారిచేసిన మౌఖిక ఆదేశాల మేరకు 108లో ఉద్యోగులుగా పనిచేస్తున్న ఈఎంటి, పైలెట్లను వైద్య ఆరోగ్యశాఖలో కాంట్రాక్టు ఉద్యోగులుగా గుర్తించి ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు.

వృద్ధురాలికి ఆపన్నహస్తం

సాయమందించిన సామాజిక కార్యకర్త కోడూరి

ప్రజాశక్తి- సాలూరు



వృద్ధురాలికి అన్నం పెడుతున్న శ్రీనివాసరావు

పక్షవాతం వచ్చిందని నిర్దాక్షిణ్యంగా ప్రభుత్వ ఐటిఐకి ఎదురుగా రోడ్డు పక్కన ఓ గిరిజన వృద్ధురాలిని ఎవరో వదిలేశారు. ఈ విషయం తెలుసుకున్న సామాజిక కార్యకర్త కోడూరి సాయి శ్రీనివాసరావు ఆమె వద్దకు వెళ్లి ఆపన్నహస్తం అందించారు. పట్టణంలోని శ్రీ సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యాన రోజూ కొంతమంది నిరుపేదలకు అన్నదానం చేస్తున్నారు. సత్యసాయి బాబా ఆలయం దగ్గరకు రాలేని వృద్ధులకు సాయి శ్రీనివాసరావు తన స్కూటీ పై భోజనం తీసుకెళ్లి అందిస్తున్నారు. గత కొన్ని సంవత్సరాలుగా ఆ కార్యక్రమం నిరంతరం కొనసాగుతూనే ఉంది. సోమవారం గిరిజన వృద్ధురాలి వద్దకు కోడూరు సాయి శ్రీనివాసరావు భోజనం తీసుకెళ్లి తినిపించారు. కన్నబిడ్డలు కాదని రోడ్డు పై వదిలేసినా తానున్నానంటూ సాయి శ్రీనివాసరావు ఆమెకు ఆకలి తీర్చారు. ఈ అనాథ వృద్ధురాలిని ఏదైనా అనాథాశ్రమంలో చేర్పించడానికి పెద్దలు కృషి చేయాలని ఆయన కోరారు.

అంగన్‌వాడీ పిల్లలకు వైద్యపరీక్షలు

ప్రజాశక్తి - సీతానగరం



అంగన్‌వాడీ పిల్లలతో మాట్లాడుతున్న డిఐఒ జగన్మోహనరావు

మండలంలోని బూర్జ, వెంకటా పురం (కామందొరవలస) లో అంగన్వాడీ కేంద్రాల్లోని పిల్లలను వైద్య పరీక్షలు జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి (డిఐఒ) డాక్టర్ టి.జగన్మోహనరావు చేశారు. ఐదేళ్లలోపు పిల్లల్లో వచ్చే శ్వాసకోశ వ్యాధులు, న్యుమోనియా లక్షణాలను గుర్తించే అంశాలపై సిబ్బందికి, పిల్లల కుటుంబ సభ్యులకు అవగాహన కల్పించారు. బూర్జ ప్రభుత్వ ఆయుర్వేద వైద్యాధికారి డాక్టర్ హేమాక్షి మాట్లాడుతూ ఈ వ్యాధులకు సంబంధించి ఆయుర్వేద మందులు అందుబాటులో ఉన్నాయని, తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. కార్యక్రమంలో వైద్య, అంగన్వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించండి



వినతులు స్వీకరిస్తున్న పిఒ నవ్య

సీతంపేట : గ్రామాల్లో ఉన్న సమస్యలు పరిష్కరించాలని పలువురు గిరిజనులు వినతులు సమర్పించారు. స్పందన కార్యక్రమం సోమవారం ఐటిడిఎలో పిఒ బి. నవ్య ఆధ్వర్యంలో నిర్వహించారు. దిమ్మిడిజోల గ్రామానికి చెందిన సవర నరసింహులు మినీ ట్రాక్టర్ లోన్ ఇప్పించాలని కోరారు. భామిని మండలంలో పసికిడి గ్రామానికి చెందిన సోమేశ్ స్పోర్ట్స్ కోచ్‌గా నియమించాలని విన్నవించారు. ఏకమానుగూడ గ్రామానికి చెందిన అన్నయ్య జీసిసి గోడౌన్‌లో ఉన్న భవనం అద్దె తగ్గించాలని, పెద్ద సంకిలి గ్రామానికి చెందిన లావణ్య కిరాణా షాపు లోను ఇప్పించాలని, బెనరాయ గ్రామానికి చెందిన కూరంగి యేబోల్ బిఎస్‌సి నర్సింగ్ సీటు ఇప్పించాలని, పులిపుట్టి గ్రామానికి చెందిన సరస్వతి ఆశ వర్కర్ పోస్టు మంజూరు చేయాలని కోరారు. ఈ స్పందన కార్యక్రమం 20 వినతులు వచ్చాయి. ఈ కార్యక్రమంలో ఎపిడి నారాయణరావు, శ్రీహరి, సిడిపిఒ పి. రంగలక్ష్మి దేవి పాల్గొన్నారు.

నడుకూరులో ఫ్యామిలీ డాక్టర్

వీరఘట్టం : మండలంలోని నడుకూరు గ్రామంలో సోమవారం 104 ఆధ్వర్యంలో ఫ్యామిలీ డాక్టర్ ఫిజీషియన్ కాన్సెప్ట్ కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక వైద్యాధికారి పి. ఉమామహేశ్వరి చంటి పిల్లలు, గర్భిణులు, బాలింతలు, వృద్ధులతో పాటు మధుమేహ, రక్తపోటు వ్యాధి గ్రస్తులకు తనిఖీలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్లు పార్వతి, నవోనమ్మ, టెక్నీషియన్ దినేష్, ఏఎన్ఎం సరస్వతి, హెల్త్ అసిస్టెంట్ వై. మోహనరావుతో పాటు ఆశ కార్యకర్తలు, 104 సిబ్బంది పాల్గొన్నారు.

నేడు వైసిపి సమావేశం

ప్రజాశక్తి - భామిని

పాలకొండ ఎఎంసి కన్వెన్షన్ హాలులో ఎమ్మెల్యే విశ్వాసారాయి కళావతి, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ ఆధ్వర్యంలో మంగళవారం జరగబోవు పాలకొండ నియోజక వర్గ వైసిపి విస్తృత స్థాయి సమావేశానికి అందరూ హాజరు కావాలని మండల వైసిపి కన్వీనర్ తోట సింహాచలం సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.


22న క్రిస్మస్ తేనేటి విందు

ప్రజాశక్తి - కలెక్టరేట్

క్రిస్మస్ పర్వదినం సందర్భంగా తేనేటి విందు కార్యక్రమాన్ని ఈ నెల 22న ఏర్పాటు చేస్తున్నామని జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారి టి.చంద్ర శేఖర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. గురువారం స్థానిక లయన్స్ క్లబ్ కళ్యాణ మండపంలో సాయంత్రం 6 గంటల నుండి జరుగుతుందన్నారు. జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్, స్థానిక ప్రజా ప్రతినిధులు పాల్గొంటారని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో క్రిస్టియన్ సంఘ ప్రతినిధులు, జిల్లా అధికారులు హాజరై విజయవంతం చేయాలని ఆయన కోరారు.

పేరుకుపోయిన ప్లాస్టిక్ సీసాలు

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్



పేరుకుపోయిన ప్లాస్టిక్ సీసాలు

జిల్లా కేంద్రమైన పార్వతీపురం పట్టణ రహదారికి ఆనుకుని ఉన్న సూర్యకళ కల్యాణ మండపం వద్ద గల ప్రధాన కాలువ పేరుకుపోయాయి. దీంతో కాలువలో మురుగునీరు ప్రవహించేందుకు అవకాశం లేదు. దీంతో కాలువల నుంచి తీవ్ర దుర్గంధం వెదజల్లడంతో స్థానికులు మున్సిపల్ అధికారులకు ఫిర్యాదు చేశారు. వీరి ఫిర్యాదు మేరకు సోమవారం స్థానిక మున్సిపల్ కమిషనర్ జె.రామ అప్పలనాయుడు స్పందించి ప్రజారోగ్య అధికారులకు ఆదేశాలు ఇవ్వడంతో వారు జెసిబి సహాయంతో కాలువలో పేరుకుపోయిన వ్యర్థాలను తొలగించారు. అయితే ఎక్కువగా మద్యం, ప్లాస్టిక్ సీసాలే ఉండడం విశేషం. ప్రధాన రహదారి ఇరువైపులా ఉన్న కాలువలపై వ్యాపారస్తులు ఆక్రమణ చేయడం వల్ల ప్రజారోగ్య సిబ్బంది కాలువల్లో చెత్తలను, వ్యర్థాలను ఎప్పటికప్పుడు తొలగించేందుకు అవకాశం లేకపోవడంతో, కాలువల్లో ప్లాస్టిక్ వ్యర్థాలు, చెత్త పేరుకుపోయాయి.

సమయపాలన పాటించాలి : ఎంపిపి

ప్రజాశక్తి - జియ్యమ్మవలస

గ్రామపంచాయతీ సచివాలయ సిబ్బంది సమయపాలన పాటించి విధులకు సక్రమంగా హాజరు కావాలని ఎంపిపి బొంగు సురేష్ ఆదేశించారు. సోమవారం ఆయన డంగభద్ర గ్రామపంచాయతీ సచివాలయాన్ని ఆ గ్రామ సర్పంచ్ జోగి భుజంగరావుతో కలిసి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పంచాయతీ పరిధిలో జరుగుతున్న అభివృద్ధి పనుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. అర్హులకు పింఛన్లు అందుతున్నాయా లేదా వివరాలు అడిగారు. పంచాయతీ పరిధిలో పనులు పూర్తిస్థాయిలో జరగాలని, అర్హులైన వారందరికీ సంక్షేమ పథకాలు అందజేయాలని సిబ్బందిని ఆదేశించారు. అనంతరం గడ్డసింగిపురం ప్రాథమిక పాఠశాలలో ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులకు విద్యా బోధన సక్రమంగా జరుగుతున్నదా లేదా అనేది పరిశీలించారు.

1200 సారా ప్యాకెట్లు పట్టివేత

పాచిపెంట : మండలంలోని యారడ్లవలసకు సమీపన గల కుమ్మరవలసకు వెళ్లే రహదారిలో మాటు వేసి 1200 నాటుసారా ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ ఎంవి రమణ తెలిపారు. ముందస్తు సమాచారం మేరకు ఈ మార్గంలో వాహనాల రాకపోకల పై నిఘా పెట్టి, పాచిపెంట ఎస్సీ కాలనీకి చెందిన యజ్జల గౌరీష్, కిల్లాడి నానిబాబు స్కూటీపై 1200 నాటుసారా ప్యాకెట్లు తీసుకువస్తుండగా పట్టుబడ్డారని చెప్పారు. వారిద్దరినీ రిమాండ్‌కు తరలించామని స్పష్టం చేశారు. ఎవరైనా అక్రమంగా నాటు సారాను తరలించిన, విక్రయించినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గ్రామాల్లో యువత దీనిపై అవగాహన కల్పించాలన్నారు.